క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన గొలకోటి సోమరాజు కుటుంబ సభ్యులు సోమవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు సత్తిబాబుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఆరుగురు కార్యదర్శుల బదిలీ

మామిడికుదురు: మండలం నుంచి ఆరుగురు కార్యదర్శులు బదిలీ అయ్యారని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. పెదపట్నం కార్యదర్శి జీవీవీ మైథిలీ బదిలీ కాగా ఆమె స్థానంలో గెడ్డం కిరణ్‌ప్రకాష్‌ను నియమించారని చెప్పారు. గోగన్నమఠం కార్యదర్శి కె.పట్టిలింగం స్థానే జీఎస్ఎన్ గోపాలరావు, పాశర్లపూడి కార్యదర్శి కేవీ సత్యనారాయణ స్థానే జి.వాసు, అప్పనపల్లి కార్యదర్శి ఎ.లక్ష్మీప్రసన్న స్థానే వి.వెంకరమణ, మొగలికుదురు కార్యదర్శి పీపీ రామచంద్రరావు స్థానే జీజీవీఆర్ కుమార్‌ను నియమించారన్నారు. నగరం కార్యదర్శి టి.ఏసుబాబును బదిలీ చేశారని అతని స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదన్నారు. కొత్తగా వచ్చిన వారిలో నలుగురు బాధ్యతలు స్వీకరించారని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఈఓపీఆర్డీగా మల్లికార్జునరావు

మలికిపురం: మండల ఈఓపీఆర్డీగా పి.మల్లికార్జునరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేస్తున్న బి.మంగాదేవి బదిలీపై వెళ్లడంతో మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులు ఐ.శుభాకర్, బి.శ్రీహరి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న



మాచవరంలో భవానీ సేవా సమితి వద్ద పూజలు చేస్తున్న మంత్రి సుభాష్

అంబాజీపేట: అన్ని దానాల కన్నా అన్నదానం మించినది లేదని ప్రతి ఒక్కరూ భక్తిభావంతో జీవనం గడపాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మాచవరం శివారు పెట్రోల్ బంక్ పక్కన సచివాలయం-4 ఎదురుగా అంబాజీపేట సేవా సమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమాన్ని శుక్రవారం మంత్రి స్వీకరించారు. భవానీ సేవా సమితి ఈ నెల 4 నుంచి భవానీ, అయ్యప్ప, వెంకన్న, షిరిడీ మాలధారులకు కాశీ విశ్వనాథశర్మ స్థలంలో భిక్ష కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. తొలుత మంత్రి సుభాష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శరణు ఘోష నిర్వహించారు. అలాగే అంబాజీపేట పశువుల సంత వద్ద వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని మంత్రి సుభాష్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

వంతెన, రోడ్డు నిర్మాణాలపై కేంద్రమంత్రికి లేఖ

మలికిపురం: రాజోలు నియోజకవర్గం మీదుగా వెళ్లే 216 జాతీయ రహదారి బైపాస్ పనులను ప్రారంభించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ లేఖ రాశారు. లేఖ కాపీని మంగళవారం మలికిపురం విలేకరులకు అందజేశారు.ఈ రోడ్డు నిర్మాణంకు ప్రధాన అడ్డంకిగా ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన కోరారు. మలికిపురం మండలం గుడిమెళ్లంక గ్రామంలో అల్లూరు విశ్వనాథరాజు కోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఆయన సమస్యకు పరిష్కార మార్గం చూస్తామని ఆయన అన్నారు.

మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: మలికిపురంలో రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి గ్రామానికి చెందిన చీర్ల దుర్గారావు(38) ఇటీవల వచ్చిన వరదల సమయంలో మలికిపురంలో పంటకాలువలో కాలు జారి మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు. వీరి కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గుండుబోగుల పెదకాపు, ముప్పర్తి నాని, ఆకుల చినవెంకన్నాయుడు, ఎన్డీఏ కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఆక్రమణలే అసలు ఇబ్బంది

- సొంత స్థలాల్లా ఉపయోగించుకుంటున్న సమీప ప్రజలు
- ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పొన్నమండ రోడ్డు మార్జిన్, రోడ్డుపై వేసిన ఇసుక, కంకర

మలికిపురం: గ్రామాల్లో అన్ని రహదారులూ ఆక్రమణలకు గురవుతున్నాయి. రోడ్డు మార్జిన్లను ఆక్రమించిన జనం వాటిలో పలు వస్తువులు ఉంచడంతో పాటు వ్యాపార స్థావరాలుగా మార్చడం వల్ల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సముద్ర తీర గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లోనూ ఈ సమస్య తీవ్రంగా ఉంది. పంచాయతీ రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్డు పలు చోట్ల ఇలా ఆక్రమణలకు గురవుతున్నాయి. వివిధ వ్యాపార స్థావరాలుగాను ఈ ఆక్రమణలు వినియోగంలో ఉంటున్నాయి. రోడ్ల పక్క దుకాణాలు ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు ఎదుట పార్కింగ్ ఉండదు. రోడ్డు పక్క మార్జిన్ స్థలాన్ని కూడా ఆక్రమించి వివిధ వ్యాపార వస్తువులను ఉంచుతున్నారు. ఇసుక, కంకర, ఇనుము వ్యాపారులు అయితే వాటినే రోడ్డు పక్కన ఉంచుతున్నారు. నివాస గృహాల వద్ద అయితే కొబ్బరిచెట్లను వేస్తున్నారు. దీంతో రోడ్లపై వెళ్లే వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. ప్రధాన కూడళ్లలో ఇది మరింత ప్రమాదకరంగా ఉంటుంది. వాహనాలను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనాలు ఇసుక కోతకు గురై ప్రయాణికులు పడిపోతున్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరు గాయపడుతున్నారు. తాటిపాక, కడలి, ములికిపల్లి, పొన్నమండ, గుడిమెళ్లంక, శంకరగుప్తం, చింతలమోరి, పడమటిపాలెం, అంతర్వేది, సఖినేటిపల్లి, వ్యయ్యారివారి మెరక, మలికిపురం, టేకిశెట్టిపాలెం గ్రామాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. పలు గ్రామాల్లో ఆ రోడ్డు మార్జిన్ల ఆక్రమణలో పడి పలువురు ప్రాణాలు సైతం కోల్పోయారు. ఈ ప్రాంతాల్లో కొంత కాలంగా అనేక మంది ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలయ్యారు. కూడళ్లలో రోడ్లు కనబడకుండా ప్రహరీలు, గోడలు కట్టడం వల్ల కూడా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అంతర్వేది కర, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మోరి-చింతలమోరి రోడ్డు, సఖినేటిపల్లి-గొంది రోడ్డు, కూనవరం- కేశనపల్లి రోడ్డులో గూడపల్లి వరకూ ఇదే దుస్థితి. తాటిపాక-ములికిపల్లి, ములికిపల్లి పొన్నమండ, గోగన్నమఠం-మగటపల్లి-మామిడికుదురు, గోగన్నమఠం-కాట్రేనిపాడు రోడ్లు ఇలా అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. పొన్నమండ-కాట్రేనిపాడు, మెరకపాలెం-గొల్లపాలెం రోడ్డులో కూడా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇలాంటి రోడ్లలో ఆక్రమణలపై ఆర్అండ్‌బీ అధికారుల దృష్టి పెట్టారు.

అరకొర నిధులతో సాధ్యమయ్యేనా..

అరకొరగా వచ్చే నిధులతో ఇది సాధ్యపడేది కాదు. ఇలా సుమారు150 కిలోమీటర్లకు పైగా వివిధ గ్రామాల్లో ఆర్అండ్‌బీ రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. దానికి తోడు ఇటీవల పలు పంచాయతీ రోడ్లను ఆర్అండ్‌బీకి బదలాయించారు. బదలాయించి సుమారు నాలుగేళ్లు పడుతున్నా అవి అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు, ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

జాగ్రత్తలు తీసుకోవడం లేదు



ఆక్రమణల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల పైనే కంకర, ఇసుక వంటివి దిగుమతి చేస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. వాహన దారులు ప్రమాదాలకు గురై చని పోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గెడ్డం ఫిలిప్‌రాజు, మలికిపురం

రోడ్ల వెంబడి డంపింగ్‌పై దృష్టి పెడతాం



రోడ్ల ఆక్రమణలు, అక్రమంగా ఇసుక కంకర రోడ్లపై డంపింగ్ చేయడం వంటి చర్యలపై దృష్టి పెడతాం. అలా అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలను కూడా తొలగిస్తాం.

– బి.రవి, ఆర్అండ్‌బీ డీఈ, రాజోలు

తక్కువ ధరలకే సరకులు ఇవ్వాలి

సఖినేటిపల్లి: కేరళ తరహాలో 16 రకాల నిత్యావసరాలను చౌక డిపోల ద్వారా తక్కువ ధరలకు సరఫరా చేయాలని సీపీఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం సఖినేటిపల్లిలో ఆ పార్టీ గ్రామ శాఖ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా మాట్లాడారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రైవేటు రంగాల్లో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని సూచించారు. మహిళల అభ్యున్నతికి ఫ్యాషన్ డిజైన్ లాంటి శిక్షణ సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు. కాగా సఖినేటిపల్లి గ్రామ పార్టీ కార్యదర్శిగా కలిగిత జాన్‌బాబు, సహాయ కార్యదర్శిగా కుసుమ రమేష్ ఎన్నికయ్యారు. నాయకులు గెడ్డం ప్రభాకర్‌రావు, చింతా ప్రసాదరావు, గొల్లమందల వసంతరావు, జె.కృష్ణ, నల్లి పద్మావతి పాల్గొన్నారు.

80 మందికి కంటి పరీక్షలు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది 80 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 18 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసేందుకు నిర్ణయించినట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన

అంబాజీపేట: ఈ పంట నమోదు జాబితాను ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయం, ఆర్బీకేల వద్ద రెండు రోజుల్లో ప్రదర్శించనున్నట్లు పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు తెలిపారు. చిరతపూడి, ఇసుకపూడి సర్పంచ్‌లు కోట బేబీరాణి, తరపట్ల మోహన్‌సింగ్ బాబురావు అధ్యక్షతన ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పంట నమోదు చేసిన రైతుల జాబితాను గ్రామ సభలు నిర్వహించి చదివి వినిపిస్తారన్నారు. రైతులకు అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. ఉద్యానశాఖ ఏఈఓ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొబ్బరి మొక్కలు, చెట్లు పిడుగుపాటు, తెగుళ్ల వల్ల చనిపోతే ఆ చెట్లను తొలగించాలన్నారు. వాటి స్థానే కొత్త మొక్కలు వేసుకునేందుకు రాయితీలు ఇస్తున్నామన్నారు. ప్యాక్‌హౌస్ కొబ్బరి నిల్వ చేసుకోవడానికి సుమారుగా రూ.2 లక్షల వరకు రాయితీ వస్తుందన్నారు. కూరపాదులు, పందిరి ఏర్పాటుకు రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఏఈఓ డి.దుర్గారావు, వీహెచ్ఏలు ఎం.రవితేజ, రైతులు లూటుకుర్తి నాగేశ్వరరావు, బొడ్డు వెంకన్న, దారపురెడ్డి శ్రీనివాసరావు, నక్కా సత్యనారాయణ, కడలి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



చిరతపూడిలో మాట్లాడుతున్న ఏడీఏ రామ్మోహనరావు

పంచాయతీ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి

అంబాజీపేట: గ్రామ పంచాయతీల వ్యవస్థపై ప్రజా ప్రతినిధులు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 16 గ్రామాలకు చెందిన ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రెండోరోజు మంగళవారంతో ముగిశాయి. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇప్పటికే సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ వ్యవస్థ, పంచాయతీ చట్టాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ మేరకు గ్రామాల్లో ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించవలసిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.

శిక్షణ గ్రామాభివృద్ధికి దోహదపడాలి

కొత్తపేట: పంచాయతీరాజ్ చట్టం-94, గ్రామ పరిపాలనపై రెండు రోజుల శిక్షణ గ్రామాభివృద్ధికి దోహదపడాలని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ సూచించారు. ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణలో భాగంగా రెండో రోజు మంగళవారం శిక్షణలో ఎంపీడీఓ నరేష్‌కుమార్ వివిధ అంశాలు వివరించారు. గ్రామ పంచాయతీ పాలనపై పంచాయతీ పాలకవర్గ సభ్యులకు స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. అప్పుడే వేగవంతమైన పాలన, మెరుగైన సేవలు అందించగలరని అన్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ సమావేశాలు, గ్రామ సభల నిర్వహణ, తనిఖీ అధికారాలు, విధి విధానాలు, పారిశుద్ధ్యం, ఆదాయ వనరులు పెంపొందించడం తద్వారా పంచాయతీ సొంతంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, పంచాయతీలో ఆర్థిక వ్యవహారాలు నిర్వహణ, భవన నిర్మాణ అనుమతులు, నిబంధనలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, న్యాయ విజ్ఞానం, పంచాయతీ ఆస్తులు, వాటి పరిరక్షణ తదితర అంశాల గురించి వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి ఎం.హరికృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ సుబ్బారావు, పలువురు ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ నరేష్‌కుమార్

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండండి



కొత్తపేటలో పొలం పిలుస్తోంది ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్న ఏఓ పద్మలత, రైతులు



రామేశ్వరంలో పొలం పిలుస్తోంది గ్రామ సభ

కొత్తపేట: ప్రస్తుత ఖరీఫ్ (తొలకరి) వరి పంటకు పలు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. తక్షణం నివారణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని ఏఓ పి.పద్మలత హెచ్చరించారు. 'పొలం పిలుస్తోంది'లో భాగంగా మంగళవారం కొత్తపేటలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏఓ పద్మలత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరిపై దోమపోటు, మాగుడు, ఆకు ఎండు తెగుళ్ల ఎక్కువగా కనిపిస్తున్నాయని, వాటి నివారణకు సకాలంలో చర్యలు తీసుకోవాలని లేకుంటే సుమారు 30 శాతం దిగుబడి తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక, రామేశ్వరం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. సర్పంచ్‌లు రేపూరి రాజేశ్వరి, కట్టా ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. వరి పంటపై ఆశించే తెగుళ్ల, వాటి నివారణ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుటకు విధి విధానాలపై ఏవో పీవీ నరసింహారావు వివరించారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ జూలీ మాట్లాడుతూ, ప్రకృతి పరంగా లభించే చెట్లు ఆకులు, ఆవు పేడ, ఆవు మూత్రం ద్వారా ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. పిడుగుపడి దెబ్బతినే కొబ్బరి మొక్కలు స్థానే, కాపుకాయని కొబ్బరి చెట్లు స్థానే కొత్తగా మొక్కలు వేసుకునే విధానం గురించి, తగిన పథకాలు గురించి ఉద్యాన శాఖ వివరించింది. మండల బీజేపీ అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, రేపూరి ఏసు నరసింహ రాజా, రైతులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలోని కూనాపాలెం ఏరియాలో సుమారు అరెకరం స్థలంలో ఉన్న పూర్వం నాటి శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కటికిరెడ్డి శ్రీనివాసరావు ఇంటి వద్ద నుంచి శ్మశానవాటికకు వెళ్లే సుమారు 200 మీటర్ల పుంత మార్గం కూడా పూర్తి అధ్వానంగా మారడంతో అపరకర్మలు చేసుకునే కుటుంబ సభ్యులకు తీవ్ర అసౌకర్యంగా మారిందని చెబుతున్నారు. దీంతో పాటు లోతట్టుగా ఉన్న శ్మశానవాటిక స్థలం కూడా మెరక చేసే పనులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న సమయాల్లో పుంత మార్గం మునిగి ఉండడం, శ్మశానవాటి స్థలం చెరువును తలపిస్తుండడం వల్ల ఆ సమయంలో మృతులను, కుటుంబ సభ్యులు రాజోలు శ్మశానవాటికకు తీసుకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోయారు. కాగా శ్మశానవాటిక రోడ్డు అభివృద్ధికి, శ్మశానవాటిక స్థలం మెరక చేసేందుకు రూ.8 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయించాలని ఇప్పటికే మండల అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినట్టు స్థానికుడు ఉండపల్లి రామకృష్ణ తెలిపారు.



కేశవదాసుపాలెం పరిధిలో లోతట్టుగా ఉన్న కూనాపాలెంలోని శ్మశానవాటిక స్థలం

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే వెన్నెముక

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే వెన్నెముక అని ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మంగళవారం అంతర్వేదిపాలెంలో మాజీ సర్పంచ్ ఈద రవిరెడ్డి ఇంటి వద్ద సీనియర్ నాయకుడు నల్లి సురేంద్ర అధ్యక్షతన పార్టీ కార్యకర్తల, నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో గొల్లపల్లి ముఖ్య అతిథిగా మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి మంచి నిబద్ధత కలిగిన కార్యకర్తలు ఉన్నారన్నారు. కార్యకర్తలు అందరూ క్రమశిక్షణతో కలసికట్టుగా పనిచేసి, పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని ఆయన సూచించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, పార్టీ ఆయా మండల అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, అడబాల బ్రహ్మాజీ, బొలిశెట్టి భగవాన్, కట్టా శ్రీను, నాయకులు తోటె జాన్‌బాబు, కోనపల్లి వేంకటేశ్వరరావు, మందపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేదిపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

చింతలూరులో బైక్ చోరీ

ఆలమూరు: మండలంలోని చింతలూరులో మంగళవారం తెల్లవారుజామున బైక్ చోరీకి గురయింది. కొత్తూరు-వెదురుమూడి రోడ్డులోని వేంకటేశ్వరనగర్‌లోని సుందరం కాంప్లెక్స్‌లో నివసిస్తున్న జి.నరేష్ ప్రతి రోజు మాదిరిగానే సోమవారం ఆరు బయట తన బైక్‌ను పార్కు చేసుకుని ఇంట్లోకి వెళ్లిపోయాడు. ఉదయాన్నే బయటకు వచ్చిన నరేష్ తన బైక్ చోరీకి గురైందని ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక కాంప్లెక్స్‌లో ఉన్న సీసీ కెమెరా పరిశీలించగా కురచ దుస్తులు వేసుకువచ్చిన ఓ వ్యక్తి అక్కడ బైక్‌లను పరిశీలించాడు. అనంతరం నరేష్‌కు చెందిన హీరో గ్లామర్ వాహనం తాళం సులువుగా వచ్చింది. దీంతో ఆ అగంతకుడు బైక్‌ను స్టార్ట్ చేసి దొంగిలించుకుపోయాడు, ఎస్సై ఎం.అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాలలు త్యాగాలకు సిద్ధం కావాలి

మలికిపురం: రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి మాలలు త్యాగాలకు సిద్ధం కావాలని మాలల న్యాయపోరాట సమితి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మలికిపురం జీపీఆర్ గ్రౌండ్స్‌లో రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల మాలల న్యాయపోరాట సమితి జేఏసీ నాయకుల సమావేశం నాలుగు మండలాల అధ్యక్షుడు చింతా రాజబాబు ఆధ్వర్యంలో గెడ్డం ఫిలిప్‌రాజు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అంబేడ్కర్, పీవీ రావు చిత్రపటాలకు జేఏసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతా రాజబాబు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వేసిన రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు తోసిపుచ్చడంపై జేఏసీ నాయకులు తీవ్ర అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి, భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు మాలల న్యాయపోరాట సమితి జేఏసీల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింతగా ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం నాలుగు మండలాల జేఏసీ పూర్తి స్థాయి కమిటీని ఎంపిక జరిగింది.



మలికిపురంలో జరిగిన మాలల జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న చింతా రాజబాబు, పాల్గొన్న నాయకులు

మహాలక్ష్మీ నమోస్తుతే..

- వివిధ అలంకారాల్లో అమ్మవార్ల దర్శనం
- భక్తుల ప్రత్యేక కుంకుమ పూజలు

కొత్తపేట: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం అమ్మవార్లు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ గ్రామాన, వాడవాడలా కనకదుర్గాదేవి ఆలయాలు, శరన్నవరాత్ర పందిర్లలో దుర్గాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అమ్మవార్ల రోజుకో అలంకరణలో భాగంగా స్థానిక గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారిని, బొరుసువారిసావరం విజయకనకదుర్గాదేవి అమ్మవారిని, ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారిని ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబాజీపేట: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు సరస్వతీ దేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో పెన్నుల పూజ చేశారు. పెద్దవీధిలో ఉన్న బేతాళ స్వామి ఆలయంలోను విజయ బేతాళుడికి, మాచవరం పక్షుల రావిచెట్టు వద్ద శ్రీరాంనగర్‌లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆత్రేయపురం: దేవీశరన్నవరాత్ర ఉత్సవాలను మండలంలోని ఆలయాల్లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని దేవీ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ధ్యాన పీఠం వద్ద దుర్గామాత ఆలయంలో అమ్మవార్ని, ఉచ్చిలిలో వేంచేసిన విజయదుర్గా దేవిని మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల వద్ద ఆధ్యాత్మిక ప్రవచనాలతో సంగీతం, నృత్య కార్యక్రమాలతో ఆలయాలు, మందిరాల వద్ద శరన్నవరాత్రుల సందడి నెలకొంది.

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు దసరా మహోత్సవాల సందర్భంగా మంగళవారం మహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో కొలువైన అన్నపూర్ణాదేవికి మంగళవారం ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు సూరిబాబు, బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న దేవీనవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని దుర్గాదేవి అమ్మవారు ఆరో రోజైన మంగళవారం మహాలక్ష్మి అమ్మవారి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.



మహాలక్ష్మిగా కొత్తపేట బంగారమ్మ తల్లి



ఉచ్చిలిలో మహాలక్ష్మిదేవిగా విజయదుర్గాదేవి



తాటికాయలవారిపాలెంలో మహాలక్ష్మిదేవి అవతారం



పెదపళ్లలో మహాలక్ష్మి అవతారంలో దుర్గాదేవి